# పోస్టులు ఖాళీ..పాలనకు ఇబ్బందులు




బొంరాస్‌పేట మండల పరిషత్ కార్యాలయం

బొంరాస్‌పేట, డిసెంబర్ 26 : బొంరాస్‌పేట మండలంలో ప్రభుత్వ పాలన పడకేసింది. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులను పర్యవేక్షించాల్సిన మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రధాన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పాలన సవ్యంగా సాగడం లేదని ప్రజా ప్రతినిధులు, ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఖాళీల భర్తీపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పేలాలేవు. మరోవైపు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రజా పాలన కార్యక్రమం ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నది. మండల పరిషత్‌లో సరిపోను సిబ్బంది లేకపోవడంతో కార్యక్రమం ఎలా అమలు చేయాలని అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. గత ఏడాది ఫిబ్రవరిలో మండలానికి ఎంపీడీవోగా శ్రీదేవి బదిలీపై వచ్చి రెండు నెలలు పనిచేసి పంచాయతీరాజ్ కమిషనరేట్ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై వెళ్లారు. ఆమె స్థానంలో ఎంపీవోగా ఉన్న పాండుకు ఇన్‌చార్జ్ ఎంపీడీవో బాధ్యతలు అప్పగించారు. ఎంపీవో పాండు గత నెలలో గుండెపోటుతో అకస్మాత్తుగా చనిపోవడంతో ఎంపీవో పోస్టు కూడా ఖాళీ అయింది. ఇన్‌చార్జ్ ఎంపీడీవో బాధ్యతలను సూపరింటెండెంట్ వెంకన్‌గౌడ్‌కు జిల్లా అధికారులు అప్పగించగా ఆయనే ప్రస్తుతం అన్ని బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. టైపిస్ట్‌గా ఉన్న వినీత్ కూడా పీఆర్ కమిషనరేట్ కార్యాలయానికి డిప్యు టేషన్‌పై వెళ్లారు. సీనియర్ అసిస్టెంట్ గోపాలకృష్ణ నెల రోజుల నుంచి దీర్ఘకాలిక సెలవు పెట్టి వెళ్లారు. జూనియర్ అసిస్టెంట్ పోస్టు మూడేళ్లుగా ఖాళీగా ఉంది. మండలంలో అభి వృద్ధి పనులను, సంక్షేమ పథకాల అమలు సరిగ్గా జరగాలంటే మండల పరిషత్ కార్యాలయంలో పూర్తిస్థాయిలో అధికారులు ఉండాలి. కానీ ప్రధానమైన పోస్టులన్నీ ఖాళీగా ఉండడంతో మండలంలో పరిపాలన సవ్యంగా సాగడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మం డల పరిషత్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఎంపీడీవో, ఎంపీవో, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రజా ప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు.

### ఆరు గ్యారెంటీల కోసం
## దరఖాస్తు చేసుకోవాలి

**పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, డిసెంబర్ 26 :ఈనెల 28 నుంచి ప్రారంభం కానున్న ప్రజాపాలన కార్యక్రమం జనవరి 6 వ తేదీ వరకు కొనసాగుతుందని, ఆరు గ్యారెంటీల కింద లబ్ధి కోసం దరఖాస్తు చేసుకోవాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పరిగిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజాపాలనపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డులోనూ ఈ కార్యక్రమం జరుగు తుందన్నారు. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ప్రజాపాలన కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. పొరపాటున ఎవరైనా దరఖాస్తు చేసుకోని యెడల గ్రామ కార్యదర్శులు 6వ తేదీ తర్వాత సైతం దరఖాస్తులు స్వీకరిం చాలన్నారు. పేదల ఆలోచనలకు అనుగుణంగా నడుచుకోవాలన్నది ప్రభు త్వ విధానమని చెప్పారు. మహాలక్ష్మి పథకం కింద కోడళ్లకు రూ. 2500 నెలకు ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతు భరోసా కింద ఎకరాకు సంవత్సరానికి రూ.15వేలు అందిస్తామన్నారు.భూమిలేని నిరుపేదలు, కౌలుకు చేసుకొని బతికేవారికి, ఉపాధిహామీ కూలీలకు రూ.12వేలు అందిస్తామన్నారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచితంగా కరెంటు అందిస్తామని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో డీపీవో తరుణ్‌కుమార్, జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి కోటాజీ, బీసీ అభివృద్ధి శాఖ అధికారి ఉపేందర్, జిల్లా మైనారిటీ శాఖ అభివృద్ధి అధికారిణి సుధారాణి, పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, దోమ, కులకచర్ల ఎంపీపీలు అనుసూజ, సత్యమ్మ, వైస్ ఎంపీపీ సత్యనా రాయణ, ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

## వాలీబాల్ విజేతగా ఇప్పాయిపల్లి జట్టు



దోమ,డిసెంబర్ 26: మండల పరిధిలోని అయినాపూర్ గ్రామంలో నిర్వహించిన దివంగత రాములు యాదవ్ స్మారక వాలీబాల్ టోర్నమెంట్‌లో ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన జట్టు విజేతగా నిలిచి మొదటి బహుమతి సాధించింది. రన్నరప్‌గా టోర్నీ నిర్వాహక గ్రామం అయినాపూర్ నిలిచింది, తృతీయ బహుమతిని ముజాహిద్‌పూర్ గ్రామ టీమ్ కైవసం చేసుకున్నది. విజేతలకు బహుమతులు అందించే కార్యక్రమానికి ఎస్సై రవిగౌడ్, సర్పంచ్ మల్లేశ్,ఎంపీటీసీ విజయ,ఉప సర్పంచ్ బుగ్గయ్య, హైకోర్టు న్యాయవాది కడుమూరి ఆనందం తదితరులు హాజరయ్యారు.

## ఘనంగా షిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్సవం



నవాబుపేట, డిసెంబర్26: మండల కేంద్రంలోని యెల్లకొండ గ్రామం పులికుంట గుట్ట (సాయిధామము) వద్ద గల షిర్డీసాయిబాబా ఆలయ రెండో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ చైర్మన్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రావుగారి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



మర్పల్లి, డిసెంబర్ 26: అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే, గడ్డం ప్రసాద్ కుమార్ మండల కేంద్రంతో పాటు పట్లూర్ గ్రామంలో సోమవారం రాత్రి మండల నాయకులతో కలిసి క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. కేక్ కట్‌చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

## క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



పరిగి, డిసెంబర్ 26: క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని అమెచూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కాసాని వీరేశ్ పేర్కొన్నారు. మంగళవారం కాసాని జ్ఞానేశ్వర్, ఏకేఐఎఫ్ వైస్ ప్రెసి డెంట్‌గా ఎన్నికైన కాసాని వీరేశ్‌ను కాసాని యువసేన నాయకులు సన్మా నించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాసాని యువసేన నాయకులు పర్శమోని బాబు, దోమ శ్రీశైలం, చౌడాపూర్ మాసయ్య, రాము పాల్గొన్నారు.

## విజ్ఞానవిహార యాత్రలో విద్యార్థులు..



పెద్దేముల్, డిసెంబర్ 26 : ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు విజ్ఞానవిహార యాత్రకు వెళ్లారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అమరావతి, మంగళగిరి, విజయ వాడ,అంతర్వేది, కాకినాడ, ద్రాక్షారామం, సామర్లకోట,యానాం, అన్నవరం, ప్రకాశం బ్యారేజీ తదితర ప్రాంతాలను సందర్శించారు. విహారయాత్రలో ఉపాధ్యాయులు శంకర్, పీడీ రాధాకృష్ణ, సంధ్య, శ్రీధర్, కృష్ణ, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి ప్రజా పాలన గ్రామసభలు

బొంరాస్‌పేట, డిసెంబర్ 26 : బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో ఈ నెల 28వ తేదీ నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు ప్రజా పాలన గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకన్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సభల నిర్వహణకు రెండు మండలాల తాసిల్దార్లు, బొంరాస్‌పేట ఎంపీడీవో, డీటీలతో నాలుగు బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. నాలుగు బృందాలలోని అధికారులు గ్రామసభలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. గ్రామ సభల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు.

## వైభవంగా దత్తాత్రేయ స్వామి జయంతి



పెద్దేముల్, డిసెంబర్ 26: మండల పరిధిలోని తట్టేపల్లి గ్రామశివారులో వెలసిన దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలను మంగళవారం శివశంకర్ మహారాజ్, మల్లికార్జున్‌ల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిం చారు. బాబుషెట్టి సుమంగి దంపతులు, మల్లికార్జున్ శాంత దంపతుల సమక్షంలో హోమాన్ని వైభంగా నిర్వహించారు. ప్రసిద్ధ యోగ గురు శివా నంద ఆచార్య తట్టేపల్లి పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు

**కొడంగల్:** శ్రీ దత్త జయంతిని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని దత్త మందిరంలో శ్రీ దత్తస్వామికి భక్తులు ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు దత్తాత్రేయ స్వామి విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. స్వామికి అష్టోత్తర శత నామావళి వంటి విశేషపూజలు నిర్వహించారు.

## ప్రతి ఇంటికీ శ్రీ రాముడి అక్షింతలు అందించాలి

పెద్దేముల్, డిసెంబర్ 26 : కులమతాలకు అతీతంగా ప్రతి ఇంటికీ శ్రీ రాముడి అక్షింతలను అందించాలని జిల్లా ప్రచార ప్రముఖ్ డాక్టర్ రమేశ్‌జీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శంభులింగేశ్వర ఆలయ ఆవరణలో రామజన్మభూమి తీర్థ క్షేత్రట్రస్టు వారు పంపిన పూజిత అంక్షితల కలశ వితరణ మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పెద్దేముల్ శంభులింగేశ్వర దేవాలయం నుంచి స్థానిక హనుమాన్ దేవాలయం వరకు శోభాయాత్రను నిర్వహించారు.అనంతరం పెద్దేముల్ నుంచి కరసేవకు వెళ్లిన కరసేవకులను ఘనంగా సన్మానించారు.

**నవాబుపేట:** ప్రతి ఇంటికీ శ్రీరామ స్వర్ణ అక్షింతలు అయోధ్య శ్రీరామ మందిర చిత్రం, ఆహ్వాన పత్రాల పంపిణీ అంటూ ప్రచార కార్యక్రమం జోరుగా సాగుతున్నది. మంగళవారం మండల కేంద్రంలోని లింగంపల్లి లక్ష్మారెడ్డి గార్డెన్‌లో 32 గ్రామాలకు చెందిన కమిటీలకు విశ్వహింద్ పరిషత్ సభ్యులు రాముడి అక్షింతలు, పత్రాలను అందజేశారు. తీసుకువెళ్లిన అక్షింతలు, పత్రాలను కూడా జనవరి ఒకటి నుంచి 15వరకు ప్రతి ఇంటికీ అందజేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మాణిక్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రకాంత్, భక్తులు పాల్గొన్నారు.

## స్పీకర్ సతీమణి గడ్డం శైలజకు నివాళి



వికారాబాద్, డిసెంబర్ 26: అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ సతీమణి దివంగత గడ్డం శైలజ తృతీయ వర్ధంతిని మంగళవారం వికారాబాద్ పట్టణంలోని ప్రసాద్ కుమార్ నివాసంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు అర్ధ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల తదితరులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వికారాబాద్ ప్రభుత్వ దవాఖాన లోని రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు.